## ఎడిటర్ వ్యూ

# ప్రపంచాన్ని వణికిస్తున్న చమురు మంటలు

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక–రాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం? కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం. కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది అమెరికా మొదట భావించిన కీలక అంచనా?ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ. అమెరికా మరో పెద్ద పొరపాటు?ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది. చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు వి70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు వి100?వి113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది. అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది?మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి. మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల?కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది?అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి? కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీ–లేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది. ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది?త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవదినాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది?చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం. ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం?అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.

## ఇంధన భయం వద్దు..41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు

- మొదటి పేజీ తరువాయి

సామాన్యులపై వీటి ప్రభావం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని చెప్పారు. దేశ అవసరాల్లో సుమారు 60 శాతం ఎల్పీజీ దిగుమతులపై ఆధారపడుతున్నప్పటికీ సరఫరా అనిశ్చిత పరిస్థితుల్లో దేశీయ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ ఉత్పత్తిని పెంచుతున్నామని వెల్లడించారు.

**3.75 లక్షల మంది స్వదేశానికి రప్పించాం**

గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారతీయులకు నిరంతర సహాయం అందిస్తూ ఇప్పటివరకు 3.75 లక్షల మందిని స్వదేశానికి రప్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు దేశాధినేతలతో కూడా చర్చలు జరిపినట్లు, భారతీయుల భద్రతపై వారు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అందుకే త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక నిల్వలు**

ఇంధనం భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని, పశ్చిమాసియా దేశాలు ప్రధాన వనరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. సరఫరా నిరంతరత కోసం పలు దేశాలతో నిరంతర సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో చిక్కు కున్న భారత నౌకలు సురక్షితంగా తిరిగి చేరాయని వెల్లడించారు. దేశానికి 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక చమురు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుపుతున్నామని తెలిపారు.

**ప్రపంచంపై యుద్ధ ప్రభావం**

గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధాని తెలిపారు. ఈ పరిస్థితుల్లో త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని పేర్కొన్నారు.

## రోజుకు 1.5జీబీ డేటా వాడుకోమని ఇచ్చి.. డేటా మిగిలితే మిడ్ నైట్‌కు మాయం చేయడం ఏంటి ?

- మొదటి పేజీ తరువాయి

అవుతుందని.. అయితే మిగిలిపోయిన డేటా మిడ్ నైట్‌కు ఎక్స్‌పైరీ అయిపోతుందని ఆయన వివరించారు. ఆ మిగిలిపోయిన డేటాకు ఎలాంటి రిఫండ్ ఉండదని చెప్పారు.

ఇదేదో పొరపాటున జరుగుతుంది కాదని.. ఇది టెలికాం కంపెనీల పాలసీ అని తెలిపారు. అవసరం ఉన్నా లేకపోయినా వాడుకోవాలని లేకపోతే మిడ్ నైట్?కు వ్యాలిడిటీ అయిపోతుందని.. ప్రస్తుతం ఇండియాలో మొబైల్ డేటాను టెలికాం కంపెనీలు ఇలా అందిస్తున్నాయని చెప్పారు. మిగిలిపోయిన.. వాడుకోని డేటాకు డబ్బులెందుకు కట్టాలని.. వాడుకోని డేటాను ట్రాన్స్?ఫర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలా జరిగితేనే.. రీఛార్జ్ చేసుకున్న కస్టమర్లకు న్యాయం జరుగుతుందని.. వాళ్లు కడుతున్న డబ్బుకు విలువ ఉంటుందని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో వాదించారు. ఈ అంశంపై ఆయన వాదనతో నెటిజన్లు ఏకపక్షంగా ఏకీభవించారు. ఉదాహరణలతో సహా ఆయన వాదనను బలపరిచారు. ఒక కిరాణా షాపుకు వెళ్లి ఒక కిలో పంచదార కొన్నామనుకుందాం. ఆ కిలో పంచదారలో 800 గ్రాములు మాత్రమే వాడుకున్నాం. ఇంకా నా దగ్గర మిగిలిపోయిన 200 గ్రాముల పంచదారను అర్ధరాత్రి వచ్చి కిరాణా షాపు యజమాని తిరిగి తీసుకుపోడని.. టెలికాం కంపెనీల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని నెటిజన్లు చెప్పారు. టెలికాం కంపెనీల డైలీ డేటా లిమిట్?పై వినియోగదారుల నుంచి గతంలోనూ తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. అయినప్పటికీ టెలికాం కంపెనీలు డైలీ డేటా వినియోగంపై 24 గంటల వ్యాలిడిటీ మాత్రమే ఇచ్చాయి. రోజుకు ఇంత అని ఆఫర్ చేసిన డేటాను వినియోగదారుడు వాడుకోకపోతే అది అతని సమస్య అని, తమకు ఏం సంబంధం ఉందని.. ఎందుకు ఆ డేటాను యాడ్ చేయాలనే రీతిలో టెలికాం కంపెనీలు వ్యవహరిస్తున్నాయి.

# 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం... ఇదీ మా స్పీడు

- మొదటి పేజీ తరువాయి

నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నెస్, అదే ఏడాది డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నెస్ నిర్మాణం పూర్తి చేస్తారని కార్యాచరణను వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉక్కు ఉత్పత్తి మాత్రమే కాకుండా విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**20 నెలల్లోనే సాధించాం**

దేశంలోనే అత్యంత వేగంగా భూసేకరణ, అనుమతులు ఇచ్చి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతుందని చంద్రబాబు అన్నారు. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీ సొంతమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20.35 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారంలో కీలక పాత్ర పోషించిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను ఆయన అభినందించారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములను త్యాగం చేసిన రైతులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**విశాఖ కేంద్రంగా ఆర్థిక ప్రగతి**

ఈ ప్రాజెక్టుతో విశాఖ ఎకనామిక్ రీజియన్.. నాలెడ్జ్ ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీకి కీలక కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, దీని ద్వారా 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం దేశంలో ఇదే తొలిసారని గుర్తుచేశారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్, బీపీసీఎల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని, పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా మూలపేట పోర్టు, జూలైలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి ఉత్తరాంధ్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాయని అన్నారు.

**స్థానిక యువతకే తొలి ప్రాధాన్యం**

ఆర్సెలర్ మిట్టల్ పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి, నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భూములు త్యాగం చేసిన రైతులకు అండగా నిలవాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు.

ముఖ్యంగా, ఈ పరిశ్రమలో తొలి ప్రాధాన్యంగా అనకాపల్లి జిల్లా యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన సూచించారు. స్థానిక యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా విజయవంతం చేస్తామని పునరుద్ఘాటించారు.

# నారా లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి తెరలేచింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వద్ద ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఏర్పాటు చేయనున్న భారీ సమీకృత ఉక్కు కర్మాగారానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో, దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా ఇది రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**చంద్రబాబు పాలన అద్వితీయం**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, అపారమైన పరిపాలనా అనుభవం, పారిశ్రామిక అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత వల్లే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రగతిశీల, పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా నిలిచింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి వారి నాయకత్వం అద్వితీయంగా రాణిస్తోంది. తండ్రికి తగ్గ తనయుడిగా నారా లోకేశ్ కూడా నిరూపించుకుంటున్నారు.ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించారు" అని అన్నారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం అనకాపల్లిని ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు.

**దేశ ప్రగతిలో భాగస్వామ్యం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత్ పారిశ్రామిక పునరుజ్జీవనంలో కొత్త శకంలోకి ప్రవేశించిందని కుమారస్వామి పేర్కొన్నారు. "ప్రధాని మోదీ రూపకల్పన చేసిన 'వికసిత్ భారత్ 2047', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల్లో భాగంగా దేశీయ ఉత్పాదన గణనీయంగా పెరగాలి. జాతీయ ఉక్కు వినియోగ విధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా ఉక్కు ఉత్పాదనను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏపీకి రావడంతో ఈ ప్రాంతంలో స్టీల్ ఎకోసిస్టమ్ సాకారమైంది" అని వివరించారు. ఈ ప్రాజెక్టు ఉక్కు ఉత్పాదనకు, ఎంఎస్ఎంఈలకు, ఉద్యోగ కల్పనకు ఒక చోదక శక్తిగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**విశాఖ ఉక్కుపై స్పష్టమైన హామీ**

ఇదే వేదికపై నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (=×చీూ) పునరుద్ధరణపై కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టమైన హామీ ఇచ్చారు. "వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను స్థిరీకరించి, గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.11,440 కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని అందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఆర్ఐఎన్ఎల్‌ను బలోపేతం చేయడానికి, ఉక్కు రంగంలో దాని పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కేంద్రం కట్టుబడి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో ఆ సంస్థను తిరిగి వృద్ధి పథంలో నిలుపుతాం" అని ఆయన స్పష్టం చేశారు.

**లక్ష మందికి ఉపాధి.. ప్రాంతీయ అభివృద్ధి**

ఈ ప్రాజెక్టును 5,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 17.8 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో పనిచేస్తుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా రూ.11,000 కోట్లకు పైగా పెట్టుబడితో 50 మిలియన్ టన్నుల సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనున్నారు. ఇది మరో 6,000 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఈ ప్లాంట్ స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని కుమారస్వామి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ఉత్పాదన ప్రారంభించాలని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

## వాలంటీర్ల సాయంతో భూ కబ్జాకు యత్నించారంటూ వైసీపీ నేతలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- మొదటి పేజీ తరువాయి

కొందరు అధికారులు, వాలంటీర్ల సాయంతో తమ భూములను కబ్జా చేశారని, రికార్డులను తారుమారు చేసి తమను రోడ్డున పడేశారని పలువురు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. మాజీ మంత్రి, ఏపీ ఉమెన్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**వాలంటీర్లతో కలిసి భూమిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారు**

అనంతపురం జిల్లా గుత్తి మండలం కొజ్జేపల్లి గ్రామానికి చెందిన పెద్ద శ్రీనివాసులు తన గోడును వెళ్లబోసుకున్నారు. మార్నెపాలం గ్రామంలో సర్వే నెం. 4–3లో తనకు వారసత్వంగా సంక్రమించిన 7.44 ఎకరాల భూమి ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు స్థానిక నేతలు వాలంటీర్లతో కలిసి తన భూమిని అక్రమంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారని ఆరోపించారు. తన భూమిని వేరే సర్వే నంబర్‌లోకి మార్చి, తప్పుడు రికార్డులు సృష్టించారని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, తన భూమిని తనకు ఇప్పించాలని ఆయన నేతలను కోరారు.

**పీర్ల చావిడి మాన్యం భూమి కబ్జా**

నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం కానాల గ్రామానికి చెందిన అబ్దుల్ మజీద్, తమ గ్రామంలోని పీర్ల చావిడికి చెందిన 4.40 ఎకరాల మాన్యం భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి తమ పూర్వీకులు ఈ భూమిని సాగు చేస్తూ వచ్చే ఆదాయంతో పీర్ల చావిడి పండుగ నిర్వహించేవారని, కానీ ఇప్పుడు భూమి కబ్జాకు గురికావడంతో సొంత ఖర్చులతో, భక్తుల చందాలతో పండుగ నిర్వహించడం భారంగా మారిందని వాపోయారు.

**9 సెంట్ల స్థలం కోసం దాడి.. కాళ్లు విరగ్గొట్టారు**

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన దాసు రామకృష్ణ, తనపై జరిగిన దాడిని వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. తనకు చెందిన 9 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి రెండు కాళ్లూ విరగ్గొట్టారని, మైనర్ బాలురతో తల పగలగొట్టించారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు నిందితులకే వత్తాసు పలుకుతున్నారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

**రికార్డుల తారుమారుతో అంతులేని వేధింపులు**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది బాధితులు భూ రికార్డుల తారుమారు, అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదులు చేశారు.

అన్నమయ్య జిల్లా: భూమిని అమ్మాక, రీ–సర్వేలోని తప్పులను ఆసరాగా చేసుకుని కొనుగోలుదారు తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నాడని శ్రీనివాసులు అనే బాధితుడు తెలిపారు.

నెల్లూరు జిల్లా: తన భూమికి కొలతలు వేసి హద్దులు చూపాలని ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కృష్ణారెడ్డి అనే రైతు వాపోయారు.

ఎన్టీఆర్ జిల్లా: తమ పూర్వీకుల స్థలంలోకి కొందరు వ్యక్తులు చొరబడి ఆక్రమణలకు పాల్పడుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

ఏలూరు జిల్లా: పేదలకు కేటాయించిన అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓ సంపన్న వ్యక్తి పేరు మీద మ్యుటేషన్ చేశారని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగినా ఇవ్వడం లేదని భాస్కరరావు ఆరోపించారు.

కాకినాడ జిల్లా: 1988లో ప్రభుత్వం ఇచ్చిన డి–పట్టా భూమిని ఆన్‌లైన్ చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిట్టియ్య తెలిపారు.

కృష్ణా జిల్లా: దస్తావేజుల ప్రకారం 1.24 ఎకరాలు ఉండాల్సిన భూమి, ఆన్‌లైన్ రికార్డుల్లో 0.19 సెంట్లుగా నమోదవడంతో రైతు భరోసా వంటి పథకాలు అందడం లేదని చిట్టిబాబు వాపోయారు.

తిరుపతి జిల్లా: ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిని సాగు చేసుకుంటుంటే, ఎటువంటి నోటీసు లేకుండా పట్టా రద్దు చేస్తానని తహసీల్దార్ బెదిరిస్తున్నారని ఎల్లమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

పల్నాడు జిల్లా: తన ఖాళీ స్థలానికి వెళ్లే దారిని మూసివేసి, గోడ కట్టి, చంపుతామని బెదిరిస్తున్నారని రామారావు అనే వృద్ధుడు ఫిర్యాదు చేశారు.

వీరితో పాటు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణం, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య సమస్యలకు ఆర్థిక సాయం వంటి పలు సమస్యలపై కూడా ప్రజలు నేతలకు వినతిపత్రాలు సమర్పించారు.

## 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా.. రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఖాయం. తాజాగా తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించిన మల్లన్న, తన మనసులోని అసలు కోరికను బయటపెట్టారు. రాజకీయంలో సీఎం ఎలాగూ కాలేను, కనీసం వెండితెరపై అయినా ముఖ్యమంత్రి పాత్ర పోషించాలని తనకు బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సినిమాల్లో సీఎం రోల్ వస్తే చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలా అయినా తన కోరికను తీర్చుకుంటానని నవ్వుతూ చెప్పారు. "రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ లీడర్ లేరని గతంలోనే చెప్పాను. ఒక రకంగా ఆయన్ను సీఎం చేసింది నేనే" అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తాను రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని ఆయన స్పష్టం చేశారు.సినిమాలపై తనకున్న మక్కువను వివరిస్తూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్వయంగా అడిగినప్పటికీ, విలన్ వేషం వేయడం ఇష్టం లేక తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. విలన్ కంటే తనకు సీఎం లాంటి పవర్‌ఫుల్ పాత్రల పైనే ఆసక్తి ఉందని ఆయన హింట్ ఇచ్చారు.

## ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్... శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి

- మొదటి పేజీ తరువాయి

టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ భారీ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగలదని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## పోలీసుల తీరుపై అంబటి ధ్వజం.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతానని హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు.టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు.ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు.

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు."గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## చంద్రబాబు విధానాలు భరోసానిచ్చాయి...

- మొదటి పేజీ తరువాయి

ఈ పరిశ్రమ అనకాపల్లి ప్రాంతానికి గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందని ప్రకటించారు.

తాను జన్మించిన భారతదేశంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మించడం గర్వంగా ఉందని మిట్టల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనలో ఇది ఆరంభం మాత్రమేనని ఆయన అభివర్ణించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలలో విశ్వాసం నింపేలా ఏపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ప్రశంసించారు.

దేశ అవసరాలకు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. మౌలిక సదుపాయాలు, రక్షణ రంగ ఉత్పత్తులు సహా అనేక రంగాలకు అవసరమైన స్టీల్ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తామని చెప్పారు. 50 ఏళ్ల క్రితం తాము తొలి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు అనకాపల్లిలో నిర్మించేది అత్యంత ఆధునిక ప్లాంట్‌గా నిలిచిపోతుందని మిట్టల్ పేర్కొన్నారు. ఈ భారీ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# మండల పరిషత్ లో వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:** మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో శెట్టిబలిజ జాతి పిత దొమ్మేటి వెంకటరెడ్డి 173జయంతి సందర్భంగా ఘన నివాళిలర్పించారు. వెంకటరెడ్డి సేవలు మరువలేనివని ఎం.పి.పి. దొమ్మేటి వెంకటేశ్వర రావు అన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ బి మమత, ఎంపీటీసీ సభ్యులు ముత్తాబత్తుల ప్రశాంత్, నాయకులు ఆఫీస్ సిబ్బంది పాల్గొని ఘన నివాళి లు అర్పించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రాష్ట్రంలో తొలి ఐఎస్ఓ గ్రామపంచాయతీగా రావులపాలెం?





## సర్టిఫికేషన్ దిశగా కేరళ ఆడిట్ బృందం పరిశీలన


**రావులపాలెం, పెన్ పవర్ మార్చి 23:**కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం గ్రామపంచాయతీ రాష్ట్రంలోనే తొలి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకునే దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం కేరళకు చెందిన ఆడిట్ బృంధం
గ్రామపంచాయతీని సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టింది. ప్రేమానంద్ సి.ఎం, సీలం కె.ఎం, రాష్ట్ర పంచాయతీరాజ్ సమన్వయకర్త ఇమామ్‌లతో కూడిన బృందం పంచాయతీ పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, రికార్డు నిర్వహణ, పౌర సేవలను సమీక్షించింది.రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలైన ఐఎస్ఓ సర్టిఫికేషన్ అందించే దిశగా ప్రభుత్వం ఏడాదిన్నర క్రితమే చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో మొదట 56 పంచాయతీలను ఎంపిక చేయగా, వడపోత అనంతరం 24 పంచాయతీలు రేసులో నిలిచాయి. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రావులపాలెంతో పాటు అల్లవరం మండలం కొమరగిరిపట్నం, బిక్కవోలు మండలం కొమరిపాలెం, గణపవరం మండలం గణపవరం పంచాయతీలు ఈ పోటీలో ఉన్నాయి.ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు అర్హత సాధించాలంటే గ్రామంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి. చెత్తాచెదారం లేకుండా శుభ్రత, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు సమర్థంగా ఉండాలి. అదేవిధంగా పన్నుల వసూళ్లు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు, ప్రజల పట్ల జవాబుదారీతనం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.సుమారు 35 వేల జనాభా కలిగిన పెద్ద గ్రామపంచాయతీ అయినప్పటికీ రావులపాలెం ఈ ప్రమాణాలను అందుకునే దిశగా ముందంజలో నిలవడం విశేషంగా మారింది. నాలుగు లైన్ల జాతీయ రహదారి, పెరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు, ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణ ఈ పంచాయతీ ప్రత్యేకతగా నిలిచాయి.


పంచాయతీకి స్థిర ఆదాయం వచ్చేలా షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర వనరుల ఏర్పాటుపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి నాగమణి అధ్యక్షతన పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, పంచాయతీ మరియు సచివాలయ సిబ్బందితో ఆడిట్ బృందం సమావేశమైంది. ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పదవీకాలంలో ఇలాంటి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఏడాదిన్నరగా సర్టిఫికేషన్ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు క్రమబద్ధంగా చేస్తున్నామని వివరించారు.అనంతరం పంచాయతీ కార్యదర్శి ఎల్. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పాత రికార్డులను బృందం పరిశీలించింది. స్వాతంత్ర్యానికి ముందునుంచీ భద్రపరిచిన రికార్డుల నిర్వహణపై వారు ప్రశంసలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే 'స్వర్ణ పంచాయతీ' ద్వారా అందిస్తున్న పౌర సేవలు, గ్రామస్థాయిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా బృందం పరిశీలించింది. మరోరోజు పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం. ఆ నివేదిక ఆధారంగానే ఐఎస్ఓ సర్టిఫికెట్‌పై తుది ఆమోదం లభించనుంది. రావులపాలెం అభివృద్ధిలో ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, గ్రామస్థులు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయడం ఈ గ్రామ విజయానికి ప్రధాన కారణమని అభిప్రాయపడుతున్నారు.

# వాడపల్లి వెంకన్న కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు

## స్వామి వారి అష్టోత్తర పూజలో అత్యధిక సంఖ్యలో పాల్గొన్న దంపతులు







**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 23**
కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో సోమవారం వేకువజామున స్వామివారి మేలుకొలుపు సేవ,
అలంకరణోత్సవం, సుప్రభాత సేవలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సేవల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఏడువారాల వెంకన్నగా భక్తుల విశ్వాసాన్ని పొందిన వాడపల్లి క్షేత్రానికి ప్రత్యేక ప్రాధాన్యం నెలకొంది. ఏడు వారాల నోము పూర్తిచేసుకున్న అనంతరం అధిక సంఖ్యలో దంపతులు ఆలయానికి చేరుకుని స్వామివారి అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే స్వామివారి కళ్యాణ మహోత్సవాలకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహోత్సవాలకు హాజరయ్యే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పన, క్యూలైన్ల నిర్వహణ, ప్రసాదాల పంపిణీ, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కళ్యాణ మహోత్సవాలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో, సాంప్రదాయ వైభవంతో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్‌రావు తెలిపారు.

# బాల్యవివాహాల వ్యవస్థను సమూలంగా రూపుమాపాలి

- ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా జా యింట్ కలెక్టర్ టీ నిశాంతి




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:**బాలికల భవిష్యత్తును కాపాడే మైలురాయిగా బాల్యవివాహాలు నిరోధక చట్టం నిలిచేలా సిబ్బంది ప్రజలు పూర్తి సమన్వయం వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి అన్నారు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నవంబర్ 17, 2025 న బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 పై జిల్లా వ్యాప్తంగా సమావేశం నిర్వహించడం జరిగింద న్నారు సమావేశము నందు మండల మండల స్థాయి లో తాహసిల్దార్లు, ఎంపీడీ వో, ఎంఈఓ, సిఎంపిఓ లు, గ్రామస్థాయి బాల్యవివాహ నిరోధక అధికారులు మహిళా పోలీసు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ సర్పంచ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఏఎన్ఎం లకు బాల్యవాహలపై అవగాహన కల్పించి బాల్య వివాహాల ఏ ప్రాంతాలలో ఎక్కువగా బాల్యవివాహాలు నమోదు అవుతున్నాయో ఆ గ్రామాలలో సిఎంపీఓ లు చురుకుగా పనిచేయాలని బాల్యవివాహాల వ్యవస్థను సమూలంగా రూపుమాపాలని ప్రజలలో చట్టంపై అవగాహన కల్పించి, చైతన్యం తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశంతో జాయిం ట్ కలెక్టర్ గ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు మారుమూల గ్రామీణ గ్రామాలలో ఉన్న ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమ లైన బుర్రకథలు హరికథ ల ప్రదర్శన ద్వారా అవగా హన కల్పించి బాల్య వివాహాల నిర్మూలన వ్యవస్థను రూపుమా పాలని సూచించారు. ఈ సందర్భంగా 2022 నుండి 2025 వరకు జిల్లా వ్యాప్తంగా 65 బాల్యవాహాలు నిర్మూలించడం జరిగిందని జిల్లా నందు బాల్య వివాహాలు విరోధక చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం వలన 2025 నవంబర్ నుండి 23 మర్చి 2026 వరకు 4 బాల్యవివాహాలు మాత్రమే నమోదు కావడం జరిగిందని వాటిని కూడా నిలిపివేయడం జరిగిందనీ తెలియజేస్తూ జిల్లా స్థాయి సమావేశం ద్వారా ప్రతి ఒక్కరు బాల్య వివాహాలపై అవగాహన పెంపొందించామన్నారు
బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాలను అరికట్టడానికి రూపొందిం చబడిన అత్యంత కీలక మైన చట్టం బాల్యవివా హాల నిరోధక చట్టమని తెలిపారు. చట్టం అమలు తీరు, ఎదురవు తున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులు బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ద్వారా బాల్యవ వాహాల రహిత కోనసీమ జిల్లాగా మార్చాలని పిలు పునిచ్చారు. ఈ చట్టం ప్రకారం వివాహ వయస్సు పురుషులకు 21 ఏళ్లు, స్త్రీలకు 18 ఏళ్లు గా నిర్ణయించబడిందన్నారు. అంతకంటే తక్కువ వయస్సులో వివాహం చేయడం నేరంగా పరిగణించాలన్నారు
బాల్య వివాహం జరిపించినా, ప్రోత్సహించినా లేదా ఆ వివాహ వేడుకలో పాల్గొన్నా నేరమని శిక్షలు జరిమాణాలు జరిమానా విధించవచ్చునన్నారు.
ప్రస్తుత గణాంకాలు
గడిచిన దశాబ్ద కాలంలో బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఈ ఆచారం ఉందన్నారు. అమలులో ఎదురవుతున్న సవాళ్లు
పేదరికం, భద్రత లేకపో వడం పురాతన ఆచారాలవల్ల గ్రామాల్లో ఇంకా రహస్యంగా వివాహాలు జరు గుతున్నాయన్నారు చట్టం గురించి దాని వల్ల కలిగే చట్టపరమైన పర్యవసానాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగా హన పెరగాలన్నారు
బాల్య వివాహాల నిరోధక చట్టం అమలులో పురోగతి ఉన్నప్పటికీ, చట్టంతో పాటు సామాజిక మార్పు కూడా అత్యంత అవసరం అన్నారు. విద్య, ఆర్థిక స్వావలంబన కఠినమైన నిఘా ద్వారా మాత్రమే ఈ దురాచారాన్ని పూర్తిస్థా యిలో రూపు మాపాల న్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పిఠాపురం పట్టణ అభివృద్ధికి తొలి ప్రాధాన్యత

- మంత్రి నారాయణ
- పిఠాపురంలో మంత్రి నారాయణ పర్యటన
- అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం





**కాకినాడ/పిఠాపురం, పెన్ పవర్,మార్చి 23,** పిఠాపురం పట్టణంలో తాగునీరు, డ్రైన్స్, సీసీ రోడ్లు, వీధీ దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక వసతుల పనులకు తొలి ప్రాధాన్యతనిచ్చి వేగంగా అమలు చేస్తామని జిల్లా ఇంఛార్జి మంత్రి, పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.సోమవారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా పిఠాపురంలో పర్యటించిన మంత్రి నారాయణ, మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి పట్టణ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, ఆర్డీఎంఏ ప్రాంతీయ అధికారి సీహెచ్ నాగ నరసింహారావు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పాడా పీడీ బీహెచ్ భవానీ శంకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అమృత్ పథకం ద్వారా పిఠాపురంలో రూ.60 కోట్లు, గొల్లప్రోలులో రూ.80 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అలాగే పిఠాపురంలో రూ.14.6 కోట్లు, గొల్లప్రోలులో రూ.8 కోట్లతో గృహ వినియోగ జలాలను శుద్ధి చేసి బయటకు పంపించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కులు, వీధిలైట్లు పనులను రాబోయే రెండేళ్లలో 100 శాతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఇరిగేషన్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, వచ్చే ఆరు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మున్సిపాలిటీల్లో డివిజన్ల పెంపుపై అధికారులు కసరత్తు చేస్తున్నారని వెల్లడించారు.ఈ సమావేశంలో పిఠాపురం కమిషనర్ ఎన్. కనకారావు, గొల్లప్రోలు కమిషనర్ పీ. శ్రీనివాసు, ఇరిగేషన్, శానిటేషన్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలుగా గొల్లవిల్లి గంగారత్నం నియమకం




**గండేపల్లి, పెన్ పవర్ మార్చ్ 23:-** ఆశ వర్కర్ల యూనియన్ గండేపల్లి మండలం అధ్యక్షురాలుగా గొల్లవిల్లి గంగారత్నము ను ఆర్ టి జయు రాష్ట్ర అధ్యక్షులు పులి ప్రసాద్ నియమించారు గండేపల్లి మెయిన్ రోడ్ లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సభను ప్రారంభించారు శ్రీ పులి ప్రసాద్ మాట్లాడుతూ రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ కి అనుబంధమైన ఆశా వర్కర్ల సమస్యలపై ఉద్యమించడానికి కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది గ్రామ ఆరోగ్య వ్యవస్థకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా పనిచేస్తూ ముఖ్యంగా మాత శిశు మరణాలను తగ్గించడంలో కీలక పాత్ర వహిస్తూ గ్రామీణ ప్రాంతంలో ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచార అందించే ఆరోగ్య వారదులు. ఆశా కార్యకర్తలు గర్భిణీలకు మందులు అందించడంలో కీలకపాత్ర వహిస్తున్నారు అటువంటి ఆశ లు వేతన స్థిరీకరణకు నోచుకోని వర్కర్లు అని సర్వేల పేరిట అదనపు భారం మోస్తున్నారు అని అన్నారు ఆశ కార్యకర్తలు గర్భిణీ స్త్రీలను గుర్తించడం వారికి నెల నెల టీకాలు వేయించడం ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించడం పారిశుద్ధ్యం మరియు ప్రభుత్వం అందించే ఇతర సేవలు వంటి ఆరోగ్య మరియు ఆరోగ్య సంబంధిత సేవలకు ప్రజల ప్రాక్యాతన సులభతరం చేయడం గ్రామ ఆరోగ్యం పరిశుభ్రం తరహా పరిహారం లేకుండా భారతదేశంలో ఆశ వర్కర్లు గౌరవం మరియు న్యాయం అనువదించబడినది వారి మొదటి సంప్రదింపు సంరక్షణ అందిస్తారు ప్రాథమిక ఔషధాలను అందిస్తారు జనన సంసిద్ధత మరియు తల్లిపాలు వంటి సమస్యలపై మహిళలకు సలహాలు ఇస్తారు ఆశా కార్యకర్తలు అంటే ప్రజలను ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానించడంలో సహాయపడడానికి స్వచ్ఛందంగా పనిచేసే శిక్షణ పొందిన స్థానిక మహిళలు అవగాహన పెంచడం ఆరోగ్య సంరక్షణ వంటి పనులు చేస్తున్న వారికి సరైనటువంటి గుర్తింపు ప్రభుత్వాలు ఇవ్వడం లేదు ఆశ వర్కర్లకు నెలకు 26 వేల రూపాయలు జీతం ఇవ్వాలని పులి ప్రసాద్ అన్నారు మండల మండల అధ్యక్షురాలుగా నియమితులైన గంగారత్నం మాట్లాడుతూ నేను గత 20 సంవత్సరాలు నుండి ఆశ వర్కర్ గా పని చేస్తున్నాను ట్రైనింగులు పొందినాను ఆశ వర్కర్లు ఏ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు వాటిపై నాకు పూర్తి అవగాహన ఉన్నది వాటిని కోసం నిరంతరం పోరాటం చేస్తానని నన్ను మండల అధ్యక్షురాలుగా నియమించిన పులి ప్రసాద్ నొక్కు భాగ్యవతులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుర్రాల లక్ష్మి మేడపాటి బొల్లాలు గుర్రం జయప్రద మచ్చ సత్యవతి తదితరులు పాల్గొన్నారు

# అంజి ఆకొండి కి అపూర్వ స్వాగతం




**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 23:**రాష్ట్ర ముఖ్యమంత్రి .నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశిష్ట ఉగాది పురస్కారాన్ని అందుకుని కాట్రేనికోన గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఆకొండి మహేష్ శర్మ ఆధ్వర్యంలో పండితులచే పూర్ణకుంభతో స్వాగతం పలికి,పూల జల్లులతో మంగళ వాయిద్యాలతో,బంధువులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయ మిత్రులు,శిష్యులు.. అందరూ కాట్రేనికోన పురవీధులలో ఊరేగింపుగా గ్రామ సందర్శన చేశారు,శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో వేద ఆశీర్వచనం చేసి అంజి స్వగృహానికి తీసుకుని వెళ్ళారు,ప్రతి ఒక్కరికి అంజి ఆకొండి ధన్యవాదములు తెలియ చేసారు.

# ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు



**అల్లవరం,పెన్ పవర్ మార్చి 23:**శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి సందర్భంగా మొగళ్లమూరులోని స్వగృహంలో సోమవారం అమలాపురం మాజీ పార్లమెంటు సభ్యులు చింతా అనురాధ వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ 19వ శతాబ్దంలోనే శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, వెనుకబడిన వర్గాలలో విద్య, ఐక్యత,ఆత్మగౌరవం పెంపొందించడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి దొమ్మేటి వెంకటరెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి వెంకటేశ్వరరావు,రాయడు విష్ణు ,కాండ్రేగుల పెద్ద అబ్బాయి, కాండ్రేగుల జవహర్ లాల్ కాండ్రేగుల రాధాకృష్ణ, కాశి చిరంజీవి , మద్దా వినోదరావు,కాండ్రేగుల భాస్కరరావు,కాండ్రేగుల కాశి , కుడుపూడి శ్రీను,గోగు భార్గవ్,చెల్లి నాగేంద్ర,చిల్లా రమణ,గోగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఆదిత్య విశ్వవిద్యాలయంలో మాట్ ల్యాబ్ వర్క్‌షాప్ ప్రారంభం




**గండేపల్లి,పెన్ పవర్,మార్చి,23**:గండేపల్లి మండలం సూరంపాలెం;ఆదిత్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో అన్ని విభాగాల విద్యార్థుల కోసం "మాట్ ల్యాబ్ ఫర్ ఎవరీ వన్ " అనే ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం డిప్యూటీ ప్రో-చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు మాట్ ల్యాబ్ ప్రోగ్రామింగ్‌లో బలమైన పునాది కల్పించడం మరియు భవిష్యత్ సాంకేతిక అవసరాలకు తగిన విధంగా వారి విశ్లేషణాత్మక మరియు సమస్య పరిష్కారం నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అని తెలిపారు.

ఈ వర్క్‌షాప్ ద్వారా మాట్ ల్యాబ్ యొక్క ముఖ్యమైన అంశాలు అయిన మ్యాట్రిక్స్ ఆపరేషన్, డేటా విశ్లేషణ, విజువలైజేషన్ టెక్నిక్స్, ఆల్గోరిథమ్స్ డెవలప్మెంట్ వంటి అంశాలు పరిచయం చేస్తున్నారు. ఈ శిక్షణ సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించామని, ప్రోగ్రామింగ్ పరిజ్ఞానం లేని విద్యార్థులు కూడా హ్యాండ్స్-ఆన్ సెషన్స్, రియల్ టైమ్ ఉదాహరణలు, ప్రాక్టికల్ అప్లికేషన్ ద్వారా సులభంగా నేర్చుకోగలరు అని నిర్వాహకులు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్, ప్లాటింగ్ మరియు విజువలైజేషన్, సిమ్యులేషన్ టెక్నిక్స్, అలాగే ఇంజనీరింగ్, పరిశోధన మరియు పరిశ్రమల లో మాట్ ల్యాబ్ వినియోగంపై వివరణ ఇవ్వబడుతుంది. విద్యార్థులు తమ అకడమిక్ ప్రాజెక్టులు మరియు ఇండస్ట్రీ-ఓరియెంటెడ్ సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ సెషన్ల నిపుణులైన రిసోర్స్ పర్సన్ శ్రీ ్.వర ప్రసాద్ గారు నిర్వహిస్తూ, ఆధునిక మాట్ ల్యాబ్ టూల్స్ మరియు వాటి ప్రాక్టికల్ వినియోగంపై విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి వైస్-చాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్-చాన్సలర్ (ఇంజినీరింగ్ & సైన్స్) డా. ఎ. రమేష్, ప్రో వైస్-చాన్సలర్ (అకాడమిక్స్) డా. ఎస్. రమశ్రీ, ఫ్రెష్మన్ విభాగం అసోసియేట్ డీన్ డా. ఎ. వనతి, మరియు ఫ్రెష్మన్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డా. సి. రాజశేఖర్ రెడ్డి, ఇతర అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన కంప్యూటేషనల్ మరియు సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# మా భూముల్లో నిర్మాణాలు ఆపండి



**ఓఎన్జీసీ అన్యాయాలపై రైతుల రిలే దీక్ష**

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;**ఓఎన్జీసి గ్యాస్ కలెక్షన్ సెంటర్ మండపేట పరిధిలో పెదపళ్ళ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పొలాలకు నగదు చెల్లించకుండానే ఓఎన్జీసీ సదరు స్థలాల్లో నిర్మాణాలు పూర్తి చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదపళ్ల మండపేట గ్యాస్ కలెక్షన్ సెంటర్ ఓఎన్జీసీ సైట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. వెంటనే పనులు నిలిపివేయాలని నినాదాలు చేశారు. తమకు రావలసిన నగదును చెల్లించకుండా తమ ఆస్తుల్లో పెత్తనం చెలాయించడం సరికాదన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తికాకుండానే తమ భూములపై అజమాయిషీ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మూడేళ్లుగా ఓఎన్జీసీ చుట్టూ తిరుగుతున్నా, కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. సోమవారం రిలే దీక్ష చేపట్టారు. ఓఎన్జీసీ స్పందించే వరకు రిలే దీక్ష కొనసాగుతాయని తెలిపారు. ఓఎన్జీసి అధికారులు తక్షణమే స్పందించి తమకు రావలసిన నగదును తమకు చెల్లించాలన్నారు. రిలే దీక్షలు చేపట్టిన రైతులకు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు రైతులకు తక్షణమే నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంటిపల్లి పాపారావు,అల్లూరి సత్యనారాయణ, శ్రీని శ్రీధర్, కంచర్ల వెంకటేశ్వరరావు, సలాది కృష్ణమూర్తి, వైట్ల జనార్ధన ప్రకాష్, ప్రసన్న, బొబ్బా ఏసుబాబు, అల్లూరి కృష్ణవేణి, అనంతలక్ష్మి, ప్రవల్లిక, డి ఉమా మహేశ్వరి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఘనంగా నిర్వహణ

**రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



**కొత్తపేట, పెన్ పవర్, మార్చి23;**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఆర్ఎస్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో సోమవారం శెట్టిబలిజ జాతిపిత కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శెట్టిబలిజ నాయకులు,యువకులు నివాళు లర్పించారు. నాయకులు మాట్లాడుతూ వెంకటరెడ్డి సమాజ సంస్కర్తగా,విద్యావేత్తగా శెట్టిబలిజ సమాజ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గం నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. 1853 మార్చి 23న అమలాపురం సమీపంలోని బోడసకుర్రులో జన్మించిన వెంకటరెడ్డి,1920లో 'శెట్టిబలిజ' పేరును స్థిరపరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి సమాజానికి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. అలాగే, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,యువ నాయకుడు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం కూడా అభినందనీయమని అన్నారు. ఈ నిర్ణయం వల్ల శెట్టిబలిజ సమాజానికి మరింత గౌరవం దక్కుతుందని, యువతలో చైతన్యం పెరుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జొన్నాడలో హోటల్ పై విజిలెన్స్ దాడులు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;**ఆలమూరు మండలం జొన్నాడ సెంటర్లో గల కోనసీమ ఫ్యామిలీ రెస్టారెంట్ లో గృహ అవసరాలకు వినియోగించవలసిన గ్యాస్ సిలిండర్లను హోటల్ నిమిత్తం కమర్షియల్ పర్పస్ మీద వినియోగిస్తున్న కారణంగా సివిల్ సప్లై తహసిల్దార్ పి వెంకటేశ్వరరావు, రాజమండ్రి విజిలెన్స్ వారు దాడి చేసి మూడు డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసి గోడౌన్ కు తరలించారు. అలాగే ఇమ్మాన్యుయేల్ టిఫిన్స్ అండ్ బిర్యానీ సెంటర్ లో సైతం ఇదే కారణంగా రెండు సిలిండర్లు సీజ్ చేసి గోడౌన్ కు తరలించామని సివిల్ సప్లై తహసిల్దార్ పి వెంకటేశ్వరరావు తెలిపారు.

# కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రూ.55 వేల ఆర్ధిక సాయం

- మానవత్వాన్ని చాటిన సేవా దాతలు
- దొమ్మేటి వెంకటరెడ్డి గారే మా స్ఫూర్తి మానవత్వమే మా అభిమతం




**కొత్తపేట, పెన్ పవర్, మార్చి23;**దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిల్లకుర్రుగ్రామ శివారు శ్రీనివాసపురం గ్రామానికి చెందిన దూనబోయిన వెంకటేశ్వరరావు రెండు కిడ్నీలు పాడవటంతో వైజాగ్ ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు. వైద్యులు కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ చెయ్యాలని సూచించారు. కిడ్నీ మార్పుడికి అధిక ఖర్చు కావడంతో వారి కుటుంబ సభ్యులు దాతలు సహకారం కోరారు. ఈ విషయం తెలుసుకున్న గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి సేవా సంస్థ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి,సోమవారం ఆయన వైద్య చికిత్స కోసం రూ. 55 వేల రూ ఆర్థిక సాయన్ని,ముఖ్య అతిధులుగా విచ్చేసిన కొత్తపేట నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ పరిశీలకులు పాటి శివకుమార్ కొత్తపేటనియోజకవర్గం టీడీపీ యువనాయకులు బొక్కా ప్రసాద్ చేతులు మీదుగా అందజేశారు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ చేస్తున్న ప్రతి సేవాకర్యాక్రమానికి పెద్దమొత్తంలో సహాయం అందజేస్తున్న జి.ఎమ్.కె చారుటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ గుత్తుల మీరాకుమార్,అధ్యక్షులు కట్టా భాస్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. కుల మత, ప్రాంతాలకు అతీతంగా ఉభయారాష్ట్రాల్లో ఆపదలో వున్న నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ చేసిన ఈసహాయం దూనబోయిన వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆశాకిరణంగా మారిందని స్థానికులు గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి సేవాసంస్థ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్,సభ్యులు డా. కుడిపూడి రాంబాబు,కోట నాగరాజు,బైరిశెట్టి వెంకటరమణ,దొమ్మేటి రాము,కవురు నరసింహాస్వామి,కూడుపూడి ఏకంబారేశ్వరరావు,పిల్లి రమేష్,పిల్లి సూరిబాబు,ముషిని వెంకటరమణ,కముజు గోపి,ఇళ్ల రామ సుబ్రమణ్యం,ఇళ్ల వీరబాబు,తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గుదుర్రులోఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి

**కాజులూరు, పెన్ పవర్, మార్చి 23:** శెట్టిబలిజ జాతి పితామహుడు, సామాజిక విప్లవ నాయకులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘ స్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి కార్యక్రమం కాజులూరు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘ నాయకులు, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం దుగ్గుదూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ద్వారా బలహీన వర్గాల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి స్వాతంత్ర్యానికి పూర్వమే సామాజిక సేవలో నిమగ్నమై, శెట్టిబలిజల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారా సాధికారత సాధ్యమని ఆ కాలంలోనే చాటి చెప్పిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. సామాన్య ప్రజలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, వారిలో ధైర్యాన్ని నింపిన ధైర్యశాలి దొమ్మేటి వెంకటరెడ్డి అని స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంతరాయ్, కూటమి పార్టీ నాయకులు, శెట్టిబలిజ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘన నివాళులు అర్పించారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయం.



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 23:** విద్యావేత్త, దొమ్మేటి వెంకట రెడ్డి ఆశయాలు అనుసరణీయమని ఏపీ మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు పేర్కొన్నారు, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయనకు నివాళులర్పించారు. దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సమాజంలో విద్యాభివృద్ధికి, ఐక్యత కోసం విశేషంగా కృషి చేశారన్నారు. కోనసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధికి పలు పాఠశాలలు స్థాపించారన్నారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించారని, శెట్టిబలిజ జాతిపితగా ప్రఖ్యాతి చెందారన్నారు.
దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మరో హామీ నెరవేర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఓ రవి కిరణ్, జడ్పిటిసి నేలకిషోర్, ఎంపీపీ కోలాట సత్యవతి సత్యం, నాయకులు నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, ఇసుకపట్ల వెంకటేశ్వర రావు, కొప్పిశెట్టి ఆనందరావు, శీలం సూర్యనారాయణ, పిల్లి ప్రసాద్, మోకా అప్పాజీ, డిప్యూటీ ఎంపిడిఓ నున్న శంకర్ నారాయణ, కార్యాలయ పరిపాలన అధికారిణి సంఘమిత్ర, నాయకులు కాండ్రేగుల సత్య ప్రసాద్, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వర రావు, కముజు లక్ష్మీ రమణ రావు, వాసంశెట్టి రాజేశ్వర రావు, వనచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలిలో ఫ్లెక్సీ వివాదం.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 23:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటుకు సంబంధించిన వివాదం రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారితీయగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామంలో ఒక వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై మరో వర్గం అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరస్పర వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం ఉద్రిక్తరూపం దాల్చే సూచనలు కనిపించడంతో స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, గ్రామ పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామంలో చిన్న చిన్న విషయాలను పెద్ద గొడవలుగా మలచకుండా, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. అనంతరం ఎలాంటి అపోహలు, ఉద్రిక్తతలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్.రాము స్పష్టం చేశారు. గ్రామంలో సఖ్యత వాతావరణం కొనసాగేందుకు పరస్పరం సహకరించుకోవాలని, చిన్న విభేదాలను పెద్ద సమస్యలుగా మార్చకూడదని సూచించారు.
గ్రామ పెద్దలు కూడా ఇరు వర్గాల వారికి వివాదాస్పద అంశాలపై సహనం పాటించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినట్లు సమాచారం. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ప్రశాంతంగా ఉంది.

## గండేపల్లి లో పలువురిని పరామర్శించిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చ్ 23 :** గండేపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన దేవళ్ళ సుబ్బారావు కుటుంబాన్ని, క్యాన్సర్ వ్యాధితోగుద్దాటి సత్తిరాజు వారి భార్య మరణించడంతో వారి కుటుంబాన్ని , బోరింగ్ వీర్రాజు భార్య హార్ట్ స్ట్రోక్ తో మరణించగా వారి కుమారుడు శ్రీను ను పరామర్శించి, పల్లి కనకారెడ్డి వారి కుమారుడు మరణించగా కనకారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, చుండు వెంకన్న వారి తల్లి మరణించగా వారి కుటుంబాన్నిఒగ్గు వెంకటరావు మరణించగా వారి కుమారులను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, రెడ్డి సుబ్బారావు, ఆళ్ల సత్తిబాబు, పోతుల బుల్లి దొర, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, పెనుగాడి నాగరాజు, పైల రమణ, గునుపిల్లి వీరబాబు, నిమ్మలపూడి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల దీక్షలకు జనసేన పార్టీ మద్దతు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;** ఆలమూరు మండలం పెదపళ్లలో ఓఎన్జిసి అధికారులు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దీక్షలు చేపట్టిన రైతులకు ఆలమూరు మండలం జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. సోమవారం రిలే దీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు జనసేన పార్టీ నాయకులు సూరపురెడ్డి సత్య, సంగిత సుభాష్, నల్లా వెంకన్న, గారపాటి శ్రీనివాస్ చౌదరి, సలాది జయప్రకాష్ నారాయణ, తోట వెంకటేశ్వరరావు, బైరిశెట్టి రాంబాబు, గుత్తుల నాగేశ్వరరావు మాకిరెడ్డి బాబి, తదితరులు దీక్షా శిబిరం వద్దకు తరలి వెళ్లారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆదేశాల మేరకు దీక్షా సుప్రభాతకు తరలివచ్చినట్టు నాయకులు తెలిపారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే విధంగా జనసేన పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని రైతులు చేసే ఏ స్థాయి పోరాటానికైనా తమ పార్టీ అండదండగా ఉంటుందని వారు తెలిపారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్లు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 23:** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ వారం దాతలు జగ్గంపేట గ్రామానికి మాగాపు అజయ్ కుమార్ కుమార్తె మాగాపు రోషిణి సత్యశ్రీ ఏడవ పుట్టినరోజు పురస్కరించుకుని ఆర్థిక సహాయం అందించారు. అన్న క్యాంటీన్ కు ముఖ్యఅతిథిగా జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు హాజరై పేదలకు అన్నం వడ్డించారు. జగ్గంపేటలో తొందర్లోనే ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాజపూడి యానిమేటర్‌పై అసత్య ప్రచారాలు ఆపాలి

* డ్వాక్రా మహిళల ధర్నా



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 23:** జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో యానిమేటర్‌పై జరుగుతున్న అసత్య ప్రచారంపై నిరసనగా డ్వాక్రా గ్రూపు సభ్యులు, యానిమేటర్లు ధర్నా చేపట్టారు. ఎటువంటి నిజ నిర్ధారణ లేకుండా కర్నాకుల వీరాంజనేయులు అనే వ్యక్తి యానిమేటర్ దవరసింగు హైమావతిపై దుష్ప్రచారం చేయడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేస్తూ సుమారు రూ. 7,75,000 ల విషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ హైమావతి వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాటలతో నిందలు వేయడం కాకుండా, అధికారులు వెంటనే స్పందించి బ్యాంకు లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించాలి. బ్యాంకు రికార్డుల ప్రకారం విచారణ జరిపి, అసలు తప్పు ఎక్కడ జరిగిందో తేల్చాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నిజనిర్ధారణ కాకుండా తప్పుడు ఆరోపణలు చేసిన వారిని, యానిమేటర్ ప్రతిష్టకు భంగం కలిగించిన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని మహిళలు కోరారు. సకాలంలో అధికారులు స్పందించి ఈ గందరగోళానికి తెరదించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సెక్రటరీ శ్రీదేవి, మంగా రామలక్ష్మి, పటాన్ సత్యవతి, కునిశెట్టి పద్మ, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొని హైమావతికి మద్దతు ప్రకటించారు.

## భగత్ సింగ్ కు ఘన నివాళి




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 23:** భారతదేశ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసి అతి చిన్న వయసులోనే ఉరికంభమెక్కి ప్రాణాలు అర్పించిన షహిద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజలకు బ్రిటిష్ వారు నుండి విముక్తి కలగాలని, ప్రజలు దోపిడీకి గురి కాకూడదని, సామ్రాజ్యవాద విష సంస్కృతి నశించాలని అతి చిన్న వయసులోనే పోరాటం చేసి ఉరికొయ్యలను ముద్దాడి ధైర్యంగా మరణించడం భారతదేశం గర్వించదగ్గ విషయమని ఆయన తెలిపారు. అమరవీరుల పోరాట స్ఫూర్తిని భారతదేశ యువత కొనియాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు డాన్ శ్రీను, సోమరాజు, లక్ష్మి, ఆంధ్ర, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం,గొల్లప్రోలు క్షేత్రస్థాయిలో మంత్రి నారాయణ పర్యటన





- పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యక్ష పరిశీలన
- జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

**పిఠాపురం/గొల్లప్రోలు, మార్చి 23:**పిఠాపురం పట్టణం మరియు గొల్లప్రోలు నగర పంచాయతీలో క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతుల పనులను స్వయంగా పరిశీలించారు. పిఠాపురం పర్యటనలో భాగంగా అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పాడా పీడీ బీహెచ్ భవానీ శంకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు మరియు స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పిఠాపురం పట్టణంలోని పలు వార్డుల్లో శానిటేషన్, డ్రైనేజీ నిర్వహణను మంత్రి స్వయంగా పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులను ఆరా తీశారు. మాధవపురం డంపింగ్ యార్డ్‌ను సందర్శించి చెత్త సేకరణ, తరలింపు, చెత్త ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. అనంతరం గొల్లప్రోలు నగర పంచాయతీలో బస్టాండ్ సమీపంలోని సూరిడు చెరువు, సూరంపాలెం బ్రిడ్జ్, రంగంపాడు చెరువు తదితర ప్రదేశాలను మంత్రి పరిశీలించి, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం కమిషనర్ ఎన్. కనకారావు, గొల్లప్రోలు కమిషనర్ పీ. శ్రీనివాసు, పిఠాపురం తహసీల్దార్ గోపాలకృష్ణ,గొల్లప్రోలు తహసీల్దార్ రామ్ కుమార్, శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి.



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:**శెట్టిబలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో సోమవారం దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. వెంకటరెడ్డిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకల్లో మల్లుల పోలయ్య, మల్లుల రామకృష్ణ, మల్లుల పుల్లయ్య, గుత్తుల చిరంజీవి, కుడుపూడి శ్రీను, చొల్లంగి రాధాకృష్ణ, బొక్కా సత్యనారాయణ, కుడుపూడి రమణ, కుడుపూడి సత్యనారాయణ, కుడుపూడి ఏడుకొండలు, చొల్లంగి నాగమల్లేశ్వరరావు, దునబోయిన మధు, స్థల దాత మల్లుల రంగయ్య, శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# జనసేన సభ్యత్వ నమోదు వజయవంతం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:**జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అమలాపురం రూరల్ మండలం తాండవపల్లి గ్రామంలో సోమవారం జనసేన సభ్యత్వ నమోదు విజయవంతంగా జరిగింది. జనసేన సాధక్ , గ్రామ కమిటీ అధ్యక్షులు రంకిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అమలాపురం రూరల్ అధ్యక్షులు లింగోలు పండు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దళిత నాయకులు గుత్తాల నాగరాజుతో పాటు సుమారు 20 మందిని ఉద్యమి సభ్యులుగా నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ కార్యదర్శి నాగమానస, ఏఎంసీ వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబు, రూరల్ మండల నాయకులు హనుమాన్ బజ్జి, సొసైటీ డైరెక్టర్ గుమ్మళ్ల సురేష్, నిమ్మకాయల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రూరల్ అధ్యక్షులు లింగోలు పండు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన పట్ల ఏర్పడిన విశ్వాసం, ఆశక్తితో దళిత సోదరులు ఉద్యమి సభ్యత్వాలు తీసుకోవడం, జనసేన పార్టీ అన్ని సామాజిక వర్గాల్లో బలంగా ఆదరణ పొందుతోందని తెలిపారు.

# ఆ మహా నాయకుని పేరు స్మరించే అర్హత మీకు మీ నాయకుడికి లేద.

- జాతీయనాయకులు విగ్రహాలు నామకరణం తొలగించాలి అని మీ ఉద్దేశమ.



**మండపేట. పెన్ పవర్.మార్చి 23:**స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరును స్మరించే అర్హత మీ నాయకుడు చంద్రబాబు నాయుడు, జోగేశ్వరరావు లతో పాటు మీకు కూడా లేదని స్థానిక విజయలక్ష్మి నగర్లో వైఎస్సార్సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఎస్సీ, బిసి, ఒసి సంఘాల వైసీపీ నాయకులు ప్రతిఘటించారు. మండపేట పట్టణంలో వాణి మహల్ సెంటర్ నందు మహాత్మా జ్యోతిరావుపూలే, డా.బాబు జగజ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎన్.టి.రామారావు, వంగవీటి రంగా గార్లతో కూడిన సెంటర్ ను జాతీయ నాయకుల సెంటర్ గా నామకరణం చేయడానికి తెలుగుదేశం నాయకులు ఎందుకు ఇంత ఉలిక్కిపాటు పడుతున్నారు తెలియడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేరును కించపరచడం లేదు, మేము జాతీయ నాయకుడిగా భావించాం కాబట్టి జాతీయ నాయకుల సెంటర్ గా నామకరణం చేయమన్నాము. మా వైయస్సార్సీపి ప్రభుత్వంలో అంబేద్కర్ గారిని గౌరవించుకుంటూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని ఒక జిల్లాకే నామకరణం చేయడం జరిగింది, అంతేకాకుండా విజయవాడ నడిబొడ్డులో 430 కోట్లుతో ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 206 అడుగుల ఎత్తులో సగర్వంగా నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను గౌరవించుకున్న ఘనత మా పార్టీ ఆది నాయకుడు జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని అదేవిధంగా దళితవాడలకు మాత్రమే పరిమితం చేస్తున్నటువంటి ఆ మహనీయులను మండపేట నడిబొడ్డులోకి తీసుకువచ్చిన ఘనత మా నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కే దక్కుతుందన్నారు. మీరు ఎన్టీ రామారావునీ గౌరవించుకోవడం అంటే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కొని రామారావును పదవిలోంచి దింపేసి మానసికంగా చంపిన వ్యక్తి మీరు చెబుతున్న చంద్రబాబు కాదా, ఆ మహానాయకుడిపై చొప్పలు విసిరి అవమానించిన నీచ ప్రవర్తన కలిగిన వారి తరుపున మాట్లాడుతున్న మీకు కనీస అర్హత కూడా లేదని వైసిపి నాయకులు ఘాటుగా స్పందించారు. రామారావుని ఓడిస్తాను అని కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన చంద్రబాబు నాయుడి గురించి మీరంతా ప్రస్తావన తేవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి గారు ఎన్టీ రామారావు గారి పేరును ఒక జిల్లాకు నామకరణం చేసి గౌరవించుకున్న ఘనత కూడా మాకే చెందుతుందని గుర్తుచేశారు. నీతిమాలిన రాజకీయలు చేస్తున్నది మేము కాదు మీ వెనకనుండి నడుపుతున్న వేగుళ్ళ జోగేశ్వరరావు చెప్పినట్లు మీరంతా నడుస్తూ ఇప్పటికీ కూడా అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు అన్నారు. విద్యపై మీరంతా పూర్తి వ్యతిరేకులు కాబట్టే రెండు సంవత్సరాలు గడిచినా కాలేజీలకు విద్యార్థుల తరుపున చెల్లించవలసిన బకాయిలు ఇప్పటివరకు చెల్లించ్చలేదని తీవ్రంగా స్పందించారు.

# కుందాలపల్లి ఘటనలో దోషులను వెంటనే అరెస్ట్ చేయాలంటూ ఛలో కలెక్టరేట్

బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్‌కు దళితుల ఫిర్యాదు




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:**దళితులను కుల వివక్ష చూపుతూ చనిపోయిన వ్యక్తి మృదేహాన్ని ప్రభుత్వం నిర్మించిన రోడ్డు వెంబడి తీసుకెళ్లకుండా అడ్డుకుని దాడికి పాల్పడిన అగ్రవర్ణాల వారిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్‌చేయలేదంటూ దళితు సంఘాల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో దళితులు సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికకు ఫిర్యాదు చేసేందుకు తరలివచ్చారు.


వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఆధ్వర్యంలో విదసం నాయకుడు బూసి వెంకట్రావు, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, మాల మహానాడు నాయకులు పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీనివాసరావు, రేవు తిరుపతిరావు, గిడ్ల వెంకటేశ్వరరావు, శెట్టిబత్తలు తులసీరావు, బీఎస్పీ ఇంచార్జ్ పొలమూరి మోహన్ తదితర ప్రజాసంఘాల నాయకులు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 16న పి.గన్నవరం మండలం కుంధాలపల్లి గ్రామంలో దళితుని శవాన్ని ప్రధాన రోడ్డు మార్గం గూండా తీసుకెళ్తున్న క్రమంలో కొంత మంది కాపు సామాజికవర్గానికి చెందిన వారు అడ్డుకుని గొడవకు దిగడం విధితమే.. దీనిపై దళితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఆరోజు పోలీసులు ఇచ్చిన హామీ మేరకు పది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినప్పటికీ ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడంతో నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్‌తో ఛలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అధిక సంఖ్యలో అమలాపురం కలెక్టర్ కార్యాలయానికి దళితులు తరలివచ్చారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతికి ఈ కేసులో పది మంది నిందితులపై కేసులు నమోదు చేసినప్పటికీ ఇంతవరకు అరెస్ట్ చేయలేదని, స్థానిక ఒక యువకుడిని అంతుచూస్తామని బెదరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. అంతే కాకుండా దళిత పేటకు తాగునీరు అందడం లేదని ఇదంతా ఉద్దేశ్య పూర్వకంగానే అడ్డు కుంటున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ సంబందిత అదికారులతో మాట్లాడారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లిన దళిత నేతలు జిల్లా ఎస్పీ రాహుల్‌మీనాను కలిసి ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ మాట్లాడుతూ ఆధునిక కాలంలో అదికూడా కులవివక్షకు పాల్పడుతూ అంతియాత్రను అడ్డుకోవడం అత్యంత అమానవీయ చర్య అన్నారు. ఇంత దారుణమైన సంఘటన జరిగినా ఇంతవరకు జిల్లా కలెక్టర్ కానీ, ఎస్పీ కానీ ఆ గ్రామంలో ఎందుకు పర్యటించలేదని ప్రశ్నించారు. ఈ ఘటనలో దోషులను రిమాండ్ విధించే వరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విదసం నేత బూసి వెంకట్రావు మట్లాడుతూ దళితులపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు కఠినంగా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. దోషులను వెంటనే అరెస్ట్ చేయకుంటే రాష్ట్ర ఉద్యమాన్ని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా చంద్రశేఖర్, కుంచే బాబులు, నక్కా సంపత్, కోట హనుమంతరావు, చింతా రామకృష్ణ, బొంతు రాజేంద్ర ప్రసాద్,మెండు డేవిడ్ అంబేద్కర్, సాపే రమేష్, పులిదిండి రాజేష్, బూసి రాంబాబు,వాకపల్లి హరీష్, మోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పోరాటానికి ఆలమూరు టీడీపీ నాయకుల మద్దతు




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;**రైతుల వద్ద నుంచి ఓఎన్జిసి వారు భూములు తీసుకుని నగదు చెల్లించకుండా గత మూడు సంవత్సరాలుగా కాలయాపన చేస్తున్న క్రమంలో రైతులు చేపట్టిన రిలే దీక్షకు ఆలమూరు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు తీసుకుని 3 ఏళ్లుగా డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టడం దారుణం అన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓఎన్జిసి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి నగదు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంటిపల్లి సతీష్, రావాడ సత్తిబాబు, ఈదల నల్లబాబు, రామానుజుల శేషయ్య, చీపురుపల్లి గణేష్ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులుపాల్గొన్నారు

# భారత రాజకీయ చరిత్రలో ప్రధాని మోదీ సరికొత్త రికార్డు.




**మండపేట. పెన్ పవర్.మార్చి 23 :** భారత రాజకీయ చరిత్రలో ప్రధాని నరేంద్ర మోదీ మరో సరికొత్త రికార్డు సృష్టించారని బీజేపీ సీనియర్ నాయకుడు కోన సత్యనారాయణ తెలిపారు. దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా కొనసాగిన ఘనత మోదీకే దక్కిందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ నేటికి మొత్తం 8,931 రోజులు పదవిలో కొనసాగి, పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న సుదీర్ఘకాల పదవీకాల రికార్డును అధిగమించారని పేర్కొన్నారు. గతంలో చామ్లింగ్ 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి ఈ రికార్డు సృష్టించారని తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం సేవలందించడం, అనంతరం దేశ ప్రధానిగా కొనసాగుతున్న ప్రయాణమే మోదీకి ఈ అరుదైన ఘనత సాధ్యమైందన్నారు. గుజరాత్‌లోని వడ్‌నగర్‌లో సాధారణ కుటుంబంలో జన్మించిన మోదీ, చిన్ననాటి నుంచి కష్టపడి ఎదిగి దేశాధినేత స్థాయికి చేరడం ప్రేరణాత్మకమని అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మోదీ, బీజేపీలో కీలక నాయకుడిగా ఎదిగారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, 2014 వరకు దాదాపు 13 సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీజేపీని విజయపథంలో నడిపిస్తూ హ్యాట్రిక్ సాధించారని కొనియాడారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించి ప్రధాని పదవిని అధిరోహించిన తొలి వ్యక్తిగా మోదీ ప్రత్యేక గుర్తింపు పొందారని, సుదీర్ఘ పరిపాలన అనుభవంతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తిగా ఉద్యమించాలి




- పి డి ఎస్ యు పిలుపు
- 95వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23;** భారత స్వాతంత్రోద్యమ విప్లవ వీరులు అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖ దేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక కొంకాపల్లి ఎస్సీ హాస్టల్లో కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో అతి చిన్న వయసులో ఈ దేశంలో పరాయి పాలన పోవాలని స్వేచ్ఛ స్వతంత్రం సిద్ధించాలని నవ్వుతూ ఉరికంబాన్ని ఎక్కిన భగత్ సింగ్ రాజ్ గురు సుక్ దేవ్ లను స్ఫూర్తిగా తీసుకొని నేడు సమాజంలో జరుగుతున్న అవినీతి అన్యాయాలపై విద్యార్థులు ఉద్యమించాలని దేశభక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు నేటి పాలక ప్రభుత్వాలు భగత్ సింగ్ లాంటి అమరవీరుల ఆశయాలను తుంగలో తొక్కి దేశాన్ని దేశ సంపదను స్వదేశీ విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దోపిడీ పీడనలకు మరియు కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా సమ సమాజ స్థాపనకు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ప్రతాప్ వి రమణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఈనెల 25న వైభవంగా తూల గిరి శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం.






-చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రతిష్ట మహోత్సవం.

-దర్శనానికి వచ్చిన భక్తులకు భారీ అన్నదానం

-ఆలయ నిర్మాణంలో ఎమ్మెల్యే సహకారం మరువలేనిది.

-ఆలయ కమిటీ సభ్యులు

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 23:** ఈ నెల 25న ప్రత్తిపాడులో అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీ సీతారాముల ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్ర గిరి కొండపై తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 20 నుండి కన్నుల పండుగగా జరుగుతున్నాయి. చిన్న జీయర్ స్వామి శిష్యుడు శ్రీ పరాశర రఘునాథ భట్టర్ స్వామి వారు మాట్లాడుతూ శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పరిసర గ్రామాల ప్రజలు హాజరై రాములోరి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి స్వీయ పర్యవేక్షణలో వేదమంత్రాల సాక్షిగా శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట,ధ్వజస్తంభ ప్రతిష్ట,ఉప ఆలయాల ప్రతిష్ట మహా వైభవంగా జరగడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ నిర్మాణానికి విశేష కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాతో పాటు పలువురు నాయకులు హాజరుకానున్నరని తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ఆలయ కమిటీ సభ్యులు అడిగిన వెంటనే సిసి రోడ్ నిర్మాణంతో పాటు తమ అనుచర గణంతో భారీ విరాళాలు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే ఈ గుడి నిర్మాణానికి సహకరించిన ప్రతి భక్తుడికి రాములోరి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. రాములోరి భక్తులు ఉత్సాహంగా ఈ మహా యజ్ఞ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. మధ్యాహ్నం 11 గంటల నుండి దర్శనార్థం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.






## ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి.



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:** శెట్టిబలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానిక బస్టాండు సమీపంలో సోమవారం దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతిని పార్టీ మండల శాక అధ్యక్షుడు, గూడాల ఫణి, కార్యదర్శి రవణం రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. వెంకటరెడ్డిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఇండస్ట్రియల్ డవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, అంబాజీపేట మార్కె ట్ కమిటి చైర్మన్ చిట్టూరి శ్రీ నివాస్, నాగాబత్తుల సుబ్బారావు, దంతులూరి శ్రీ నురాజు, అరిగెల బలరామమూర్తి, కత్తుల బాబులు, దొమ్మేటి బాబూ ప్రసాద్, పితాని కేశవ, ఉందుర్తి నాగబాబు, జలందర్, పల్ల శ్రీ నివాసరావు, తిరుమనాధం హనుమంతరావు, పితాని ఈశ్వరరావు, మట్ట నాగేంద్ర, జోగి కృష్ణచైతన్య, గుత్తుల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరెడ్డి జీవితం శెట్టిబలిజ యువతకు స్ఫూర్తి ఆదర్శం

### - జిల్లా జాయిం ట్ కలెక్టర్ టీ నిశాంతి



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:** శెట్టిబలిజలను ఐక్యం చేసి, వారికి సమాన గౌరవం, సమాజంలో ప్రత్యేక స్థానం జాతికి ఔన్నత్యాన్ని తీసు కురావడానికి కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జీవి తం ప్రతి ఒక్క శెట్టిబలిజ యువతకు స్ఫూర్తిగా ఆదర్శంగా నిలు స్తుందని జిల్లా జాయిం ట్ కలెక్టర్ టీ నిశాంతి పేర్కొ న్నారు. సోమవారం స్థానిక కలెక్ట రేట్ నందు జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి 173 వ జయంతి వేడుకలను అధికారికంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ

దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టి బలిజల ఆత్మగౌరవానికి ప్రభుత్వ గౌరవం అందించే దిశగా, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిం చాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ నిర్ణయం అత్యంత ప్రశంస నీయమన్నారు శెట్టిబలిజ సమాజం అందరూ శెట్టిబలిజ జాతిపిత, విద్యాధాత చైతన్య దీప్తి దొమ్మేటి వెంకటరెడ్డి జ యంతి సందర్భంగా వారి పేరుతో శెట్టి బలిజి సంఘ ప్రతిని ధులు గౌరవ పూర్వక వందనాలు తెలిపారు.

శెట్టిబలిజ సమాజం చరిత్ర లో అత్యంత ప్రతిష్ఠాత్మక స్థానం పొందిన ఈ మహా పురుషుడు విద్యాదానం, సామాజిక ఐక్యత, సామా జిక గౌరవం కోసం నిరంతరం పోరాడిన విద్యావంతుడుగా పేరుగాం చారన్నారు. శెట్టిబలిజలను ఐక్యం చేసి, వారికి సమాన గౌరవం, సమాజంలో ప్రత్యేక స్థానం తీసుకురావడానికి కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జీవితం ప్రతి ఒక్క శెట్టిబలి జ యువతకు స్ఫూర్తి దా యకమన్నారు. శెట్టిబలిజల ఆత్మ గౌరవానికి ప్రభుత్వ గౌరవం అందించే దిశగా, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ఆయనకు దక్కిన గౌరవంగా భావించా లన్నారు. ఈ సందర్భంలో శెట్టిబలిజ సమాజం అందరూ ఐక్యంగా, సమాజిక సమగ్రత, నైతిక మూల్యాలను సంర క్షించే విధంగా నడుచుకుంటూ, విద్య, సేవ, సమాజ సేవల ద్వారా దొమ్మేటి వెంకటరెడ్డి చిరస్మ రణీయులుగా నిలిచారన్నారు ఆయన జయంతి దినం సమాజానికి సంస్కారం, సమానత్వం, సామాజిక సమైక్యత వంటి విలువలను మరోసారి గుర్తు చేసే పవిత్ర సందర్భంగా మనం భావిస్తూ, వారి జీవిత సందేశాన్ని అను సరిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు దొమ్మేటి వెంక టరెడ్డి కోనసీమ ప్రాంతానికి చెందిన గొప్ప సామాజిక సంస్కర్త మరియు శెట్టిబలిజ సామాజికవర్గ ఆత్మగౌరవ ప్రదాత అన్నారు 19వ శతా బ్దంలోనే అట్టడుగు వర్గాల విద్యా భివృద్ధి, ఐక్యత కోసం శెట్టి బలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, గాంధీజీ కంటే ముందే వయోజన విద్య, హక్కుల కోసం కృషి చేసిన మహనీ యుడన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ వెంకట రెడ్డి సేవలను గుర్తిస్తూ ఏపీ ప్రభుత్వం ఆయన జయం తిని మార్చి 23న రాష్ట్ర పండు గగా ప్రకటించింద న్నారు 1853 మార్చి 23 న కోనసీమలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించా రన్నారు అమలా పురంలోని బ్రిటిష్ వారి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిం చారన్నారు. శెట్టిబలిజ సమా జంలో విద్య, ఆత్మగౌరవం, ఐక్యత ను పెంపొందించడానికి శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించారన్నారు శెట్టిబలిజ జాతిపితగా, సామాజిక సం స్కర్తగా ఆయనను శెట్టిబలిజి నాయకులు ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు ఆయన చొరవతో వెనుకబడిన వర్గాలలో విద్య, సామాజిక చైతన్యం పెరిగిందని ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ ఉదయ భాస్కర్ జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి శెట్టి బలిజ సంఘ ప్రతినిధులు బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు


## పేదల ఇంటి స్థలాలను డంపింగ్ యార్డ్‌గా మార్చిన కూటమి ప్రభుత్వం -వైసీపీ నేతలు ఆగ్రహం



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;** మండలంలోని నవాబుపేట గ్రామంలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని, వారి యొక్క విధి విధానాలపై వైసీపీ నేతలు, గ్రామస్థులు, మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సుమారు 72 మందికి ఇంటి స్థలాలుకేటాయించగా, ప్రస్తుతం ఆ భూములను డంపింగ్ యార్డ్‌గా ఉపయోగించడం పేదలపై జరిగిన పెద్ద అన్యాయమని విమర్శించారు. మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆలమూరు మండల వైసీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవాబుపేట సర్పంచ్ సురేఖ,రాష్ట్ర మేధావుల ఫోరం వర్గం కార్యదర్శి హరీష్,చల్లా సుబ్బయ్య,గోపు నాగేశ్వర రావు,గుత్తుల లక్ష్మణ రావు,కంపంశెట్టి శ్రీనివాస్,సింగం శెట్టి లలిత దేవి, వార్డ్ మెంబర్లు, తదితరులు కలిసి ఏవో మెహెర్ ప్రకాశ్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదల కోసం కేటాయించిన భూములను చెత్త మైదానాలుగా మార్చడం దారుణమని, ఇది పేదల గౌరవాన్ని తుంగలో తొక్కినట్టేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పక్కనబెట్టి, వారి హక్కులను హరిస్తూ అన్యాయ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆ భూములను శుభ్రపరచి, అసలైన లబ్ధిదారులకు అప్పగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి వేడుకలు

### కూటమి ప్రభుత్వానికి ఆలమూరు మండల శెట్టిబలిజ నేతలు హర్షం



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 23;** శెట్టిబలిజ సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు మండల కేంద్రమైన ఆలమూరులో ఘనంగా నిర్వహించారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వెనుక కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, పొలిటిబ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అలాగే శెట్టిబలిజ కుల పెద్దలు, సంఘీయులు చేసిన నిరంతర కృషి కీలకంగా నిలిచిందని కార్యక్రమంలో పలువురు తెలిపారు. వారి సమిష్టి ప్రయత్నాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ గౌరవప్రదమైన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏం ఆర్ ఓ ఆఫీస్ రోడ్‌లోని వినాయక ఆలయం సమీపంలో ఆలమూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా రాంబాబు, మండల శెట్టిబలిజ నాయకుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఆనందంలో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒకరికి ఒకరు స్వీట్స్ పంచుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కేతా రాంబాబు, మండల శెట్టిబలిజ నాయకులు మాట్లాడుతూ, “దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సమాజ అభివృద్ధికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు. ఆయన ఆశయాలు, సేవలు నేటి తరాలకు ప్రేరణ. ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం సమాజానికి గౌరవం తీసుకువచ్చే చారిత్రాత్మక నిర్ణయం” అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, సమాజ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయుడికి నివాళులు అర్పించారు. కార్యక్రమం భక్తి, గౌరవభావాలతో కొనసాగింది. దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు శెట్టిబలిజ సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విధంగా ఉండటంతో, ఆయనను ప్రతి ఏడాది జయంతి సందర్భంగా స్మరించుకోవడం సమాజం యొక్క బాధ్యతగా పలువురు అభిప్రాయపడ్డారు.


## వైభవంగా ధ్వజ స్థంభ పున: ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు





**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 23:** మండల పరిధి నందంపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామివారి ఆలయంలో ధ్వజస్థంభ పున: ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వైఖానస ఆగమ పండితులు శ్రీ మాన్ సుదర్శనం జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో ఈ నెల 25న ధ్వజ, గరుడ అల్వార్ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడురోజులు జరుగు పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని కోరారు. మూడురోజులు ఆలయ ప్రాంగణంలో వేదపారాయణ కార్యక్రమం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆలయప్రాంగణంలో కొత్తపేట శారదా కళాక్షేత్రం వారిచే చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి

## పెట్రోల్ కొరత భయం వాహనదారుల కష్టాలు,





**కొత్తపేట, పెన్ పవర్, మార్చి23;** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో పెట్రోల్ కొరత వస్తుందనే ప్రచారం వ్యాప్తి చెందడంతో వాహనదారులు సోమవారం సాయంత్రం భారీగా బంకుల వద్దకు చేరుకుని పెట్రోలు కొనుగోలు చేయడానికి బారులు తీరారు. హెచ్పి, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులతో పాటు మరికొన్ని బంకుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవాలనే ఆందోళనతో కొందరు అధికంగా కొనుగోలు చేయడంతో రద్దీ మరింత పెరిగింది.

ఈ అకస్మాత్తు రద్దీతో పెట్రోల్ బంక్ సిబ్బంది తల పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. సరఫరా, పంపిణీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తాయి. వాహనదారుల ఒత్తిడి, గందరగోళం కారణంగా సిబ్బంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని సరఫరా సజావుగా కొనసాగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. బంక్ యజమానులు కూడా కొరత లేకుండా ఇంధనం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గుడివాడ అమర్నాథ్ నియామకంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసిపి బలోపేతం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 23:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ గా గుడివాడ అమర్నాథ్ నియామకంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.నూతనంగా నియమితులైన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ పశ్చిమగోదావరి బయలుదేరి వెళుతున్న సందర్భంగా ప్రత్తిపాడు మురళీకృష్ణంరాజు అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సాలువా కప్పి గజమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చిక్కాల రామారావు,చోడవరం జడ్పీటీసీ దొండ రాంబాబు,ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్,ముదునూరి సీతారామరాజు,సర్పంచులు,ఎంపీటీసీలు,వైస్సార్సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకుటిత దీక్షతో పనిచేయాలి.

★ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 23:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకుటిత దీక్షతో పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబును బంకు శ్రీను ఆధ్వర్యంలో రాచపల్లి గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, వైసిపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వైసిపి పాలనలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాచపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


## అంత్యోదయ సాధనే బిజెపి లక్ష్యం:

✹ కోరుకొండలో ప్రశిక్షణ మహా అభియాన్ ప్రారంభం



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 23:**కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కోడూరి లక్ష్మీనారాయణ, ఏపీఆర్ చౌదరి, సుధీర్ కుమార్, మద్దిపాటి రజిని జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి సైతం ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే పండిట్ దీన్ దయాళ్ ఆశయమని, ఆ లక్ష్యం కోసమే ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.ఈ శిక్షణా శిబిరంలో ప్రముఖ నాయకులు నీలపాల వెంకన్న, చొంగ సత్యనారాయణ, రాధాకృష్ణ, దొరబాబు, తగరంపూడి గణపతి,తదితరుల పాల్గొని వివిధ అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో కూడిన రాజకీయాలే బిజెపి ప్రత్యేకత అని, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండ తగ్గించి ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని పెంచాలి






**– జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి**

**అమలాపురం /అంబాజీపేట అమలాపురం మార్చి 23:** ఎల్పిజి గ్యాస్ బదులుగా ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం వల్ల పరాయి దేశాలపై ఆధార పడకుండా స్వయం సమృద్ధి సాధ్యపడి ఆర్థికంగా పర్యావరణ భద్రతాపరంగా కూడా చాలా ప్రయోజనకరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి తెలిపారు. సోమవారం మొట్టమొ దటిసారిగా కోనసీమ జిల్లాలో హోటల్ యాజ మాన్యాలు పర్యాటక సంక్షేమ వసతి గృహాల వివిధ దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులు వివిధ శాఖల జిల్లా అధికారులతో ఎల్పిజి గ్యాస్ కు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియో గంపై మేధో మదన సదస్సును నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త ఇంధన సర ఫరా గొలుసుపై, ముఖ్యంగా భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై తీవ్ర ప్రభావంచూపి గ్యాస్ కొరత ఏర్పడిందన్నారు ఈ నేపథ్యంలో లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ కొరత సంక్షోభాన్ని అధిగమించేందుకు మేధో మథన సదస్సు ద్వారా పలు కంపెనీలు ప్రతినిధులు పవర్ పాయింట్ రివెంటేషన్ ద్వారా సౌర శక్తి విద్యుత్ బయోగ్యాసు పైప్ లైన్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యూనిట్ల స్థాపన కై అవగాహన పెంపొందించారు ఎల్పిజి కొరతను అధిగమించే ప్రత్యామ్నాయ మార్గాలైన విద్యుదీకరణ ఎలక్ట్రికల్ కుకింగ్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం అన్నారు.

తద్దనంతరం వివిధ ప్రత్యామ్నాయ పద్ధతులను వివరించడానికి ప్రత్యక్షంగా కొందరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరికొందరునిపుణులు క్రింది విషయాలను విరించారు.

గ్యాస్ సిలిండ ర్లపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని పెంచా లని నిపుణులు సూచిస్తు న్నారన్నారు. సౌర శక్తి, ఇతర పునరుత్పాదక ఇంధనాలతో అనుసంధానించినప్పుడు ఈ విధానం అత్యంత చౌకైన మార్గమ న్నారు సౌరశక్తి విద్యుత్ యూనిట్లు ప్రచారాన్ని గ్రామీణ స్థాయికి తీసుకుని వెళ్లాలని సూచించారు.

బయో–సిఎన్‌జి మరియు కంప్రెస్డ్ బయోగ్యాస్ వ్యర్థాల నుండి ఇంధనాన్ని తయారు చేయడంపై సమగ్రమైన చర్చ జరిగిం దన్నారు వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ చెత్త మరియు పశువుల పేడ ద్వారా బయోగ్యాసును ప్రోత్సహించాలన్నారు ఈ ప్రక్రియ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా దిగుమతుల భారాన్ని తగ్గిస్తుందన్నారుగ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్ ఇంధనంగా పిలవబడే గ్రీన్ హైడ్రోజన్‌ను వంట గ్యాస్ లో కొంత శాతం కలపడం గురించి చర్చించడం జరు గుతుందన్నారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (గ్రాచీ+) విస్తరణ ద్వారాగ్రా+ సిలిండర్ల రవాణా ఖర్చులను తగ్గించడానికి, పట్టణ ప్రాంతాల్లో పైపుల ద్వారా సహజ వాయువును అందించడం కొంతమేర జరుగుతోందని దీని విస్తరణ ద్వారా ఎల్పిజి కొరతను అధిగమించాల న్నారు. ఈ గ్యాస్ మరింత సురక్షితం నిరంతర సరఫ రాను నిర్ధారిస్తుందన్నారు.

నేరుగా సూర్యరశ్మితో పనిచేసే సోలార్ కుక్కర్లు మరియు సోలార్ ప్యానెల్స్ ద్వారా నడిచే హైబ్రిడ్ వంట పరికరాల రూపకల్పనపై వివిధ కంపెనీలు ప్రతినిధు లు గోదావరి పైప్డ్ గ్యాస్ ప్రతినిధి శ్రీకాంత్ నెద్ కాప్ ఇంజనీర్ రాజు ఎస్సేస్ ఇంజనీరింగ్ అధినేత కీర్తి జైన్ వెంకటేష్ పార్వతి కిచెన్ ఈక్వయిప్మెంట్ అధినేత వినయ్ కుమార్ దృశ్య శ్రావణ మధ్యామల ద్వారా విరించగ

జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో సౌర విద్యుత్ నిపుణులు రాజస్థాన్ జోదపూర్ నుండి సందీప్ కచవా గుజరాత్ బరోడా నుండి దీపక్ గదియా అధికారులతో చర్చిం చారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూపొందిం చిన సూర్య నూతన వంటి ఇండోర్ సోలార్ కుకింగ్ సిస్టమ్స్‌ను ప్రోత్సహిం చాలని నిర్ణయించారు.

ఇంధన వైవిధ్యం కేవలం ఒకే రకమైన ఇంధనంపై ఆధారపడకుండా, వంట అవసరాల కోసం వివిధ రకాల ఇంధన వనరులను అందుబాటులోకి తెచ్చుకో వాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింద న్నారు అంతర్జాతీయ ఉద్రిక్తతల దృష్ట్యా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచినట్లుగానే, గ్యాస్ నిల్వలను కూడా పెంచడం.స్వయం సమృద్ధి విదేశీ గ్యాస్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించి, దేశీయంగా లభించే వనరులను గరిష్టంగా వినియోగించాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ భద్రత దృష్ట్యా ఇంధన స్వయం సమృద్ధి అనేది ప్రస్తుత తరుణంలో అత్యంత కీలకమన్నారు. ప్రత్యా మ్నాయ ఇంధనాల వైపు మళ్లడం వల్ల బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయ న్నారు ప్రత్యామ్నాయ వనరులను వాడటం వల్ల బిలియన్ల కొద్దీ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందన్నారు. అంత ర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన ప్పుడు సామాన్యుడిపై పడే భారం తగ్గుతుందన్నారు. సొంతంగా ఉత్పత్తి చేసుకునే విద్యుత్ లేదా బయోగ్యాస్ ధరలు మన నియంత్రణలో ఉంటాయ న్నారు.కార్బన్ ఉద్గారాల తగ్గింపు గ్రా+ కంటే విద్యుత్ సౌర శక్తి బయోగ్యాస్ వంటివి తక్కువ కాలుష్యాన్ని కలిగిస్తాయన్నారు బయోగ్యాస్ తయారీ ద్వారా పట్టణ గ్రామీణ వ్యర్థాలను సమర్థవం తంగా ఇంధనంగా మార్చవచ్చునని ఇది స్వచ్ఛ భారత్ లక్ష్యానికి కూడా సహకరిస్తుంద న్నారు జిల్లా పౌరసరఫరా ల అధికారి ఏ ఉదయభా స్కర్ ప్రసంగిస్తూ ఇరాన్– ఇజ్రాయెల్ వంటి యుద్ధ వాతావరణం నెలకొన్న ప్పుడు సరఫరా గొలుసు దెబ్బతిన్నా, మన దేశీయ వనరులు మనల్ని ఇబ్బంది పడకుండా కాపాడతాయ న్నారు దిగుమతులపై ఆధారపడటం తగ్గితే, అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో కూడా దేశంలో ఇంధన కొరత ఏర్పడదన్నారు.ప్రతి పౌరుడు బాధ్యతగా కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్ వంటను అలవాటు చేసుకోవాల న్నారు ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా వంటకు ఇతర అవసరా లకు ఉచితంగా, స్వచ్ఛ మైన ఇంధనాన్ని పొందవచ్చునన్నారు శిలాజ ఇంధనాల కంటే పునరుత్పాదక ఇంధనాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాల న్నారు.భారత ప్రభుత్వం కూడా పిఎం సూర్య ఘర్ యోజన వంటి పథకాల ద్వారా రాయితీలతో ప్రజలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహిస్తోందన్నా రు. హోటల్ యజమాన్యా లు ప్రతినిధులు తమకు అవసరమైన ఎల్పిజి గ్యాస్ కు బదులు గా ప్రత్యా మ్నాయ యూనిట్లు నెలకొల్పడంలో ముందుకు వస్తే వాటిని ప్రభుత్వానికి నివేదించి రాయితీలతో ఏర్పాటుకు తగు చర్యలు గైకొనడం జరుగుతుంద న్నారు. అలాగే పర్యాటక రంగం దేవస్థానంలో ప్రత్యామ్నాయ యూనిట్లు ఏర్పా టుకు ప్రభుత్వ పరంగా తగిన సహకారం అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో గోదావరి పైప్ లైన్ గ్యాస్ సౌరశక్తి నెట్ కాప్, ఎలక్ట్రికల్ కుకింగ్ సిస్టం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# బాబోయ్ పులి

**పులి రీ ఎంట్రీ తో భయాందోళన లో గిరిజనలు**

**మా ప్రాంతం నుండి తరలించండి బాబోయ్**







**గంగవరం పెన్ పవర్ మార్చి 23:** గత నెల రోజులుగా గిరిజనులు తీవ్ర భయాందోళన గురి చేస్తున్న పెద్దపులిని తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ జిల్లా సబ్ ప్లాన్ ఏరియాలో ప్రజలను గడగడ వనికించి తిరిగి పోలవరం జిల్లాలోకి ప్రవేశించిన బెంగాల్ టైగర్ గత నాలుగు రోజులుగా రాజీవ్ మంగి అడ్డతీగల గంగవరం మండలాల ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది. రెండు రోజుల క్రితం గంగవరం మండలంలోకి ప్రవేశించిన బెంగాల్ టైగర్ ఆదివారం రాత్రి వేము లోవ గ్రామానికి చెందిన ఆవు దూడ పై దాడి చేసి పూర్తిగా తినివేసింది. దీంతో గిరిజనులు వ్యవసాయ పనులకు పశువుల కాయడానికి బయటకు వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు . ఇంటికే పరిమితం అవుతున్నారు. పాపికొండలు అభయారణ్యం నుండి కాకినాడ జిల్లా హంసవరం వరకు వెళ్లిన పెద్దపులి తిరిగి పోలవరం జిల్లాలోకి ప్రవేశించడంతో అటవీ శాఖ అధికారులకు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. అటవీ శాఖ అధికారులు పులి నుండి వస్తున్న సంకేతాల ఆధారంగా పరిసర ప్రాంతాల రైతులను గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. పెద్ద పులిని సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అటవీ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల బృందం సైతం పెద్దపులి సంచారిస్తున్న ప్రదేశాలను సందర్శించి సూచనలు ఇస్తున్నారు . పెద్దపులిని ఎప్పుడు పట్టుకుంటారో అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.